క్లుప్తంగా

ఆర్థిక చేయూత



నగదు అందజేస్తున్న యూనియన్ ప్రతినిధులు

చిట్యాల: మండలంలోని వెలిమినేడు గ్రామ ట్రాక్టర్స్ యూనియన్ సభ్యుడు సుర్కంటి ప్రతాప్‌రెడ్డి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో ఆ యూనియన్ సభ్యులు సేకరించిన లక్షా ఇరవై రెండు వేల రూపాయల నగదును బుధవారం మృతుడు ప్రతాప్‌రెడ్డి కుటుంబ సభ్యులకు యూనియన్ సభ్యులు అందజేశారు.

నూతన కమిషనర్‌కు సన్మానం



కమిషనర్‌ను సత్కరిస్తున్న నాయకులు

నకిరేకల్ : నకిరేకల్ మున్సిపాలిటీ నూతన కమిషనర్ ఎ.రంజిత్‌కుమార్‌ను బీజేపీ మండల, పట్టణ కమిటీ నాయకులు బుధవారం మున్సిపల్ కార్యాలయంలో కలిసి సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ మండల, పట్టణ అధ్యక్షులు బుడిగె సైదులు, గర్రె మురళీమోహన్, నాయకులు యానాల శ్రీనివాస్‌రెడ్డి, పల్స శ్రీనివాస్‌గౌడ్, జిల్లా డాకయ్య, మంగినపల్లి కిషన్, బ్రహ్మదేవర రవిశంకర్, పందాల సైదులు, బోనగిరి వెంకన్న, ఉప్పల నాగరాజు, వనం వేణు, పుట్ట వెంకన్న, కాడింగు నాగరాజు నడికుడి సైదులు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలకు విరాళం



విరాళం అందజేస్తున్న గోవిందరాజులు

నకిరేకల్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల్లో ప్రతిభ, పోటీతత్వం, ప్రమాణాలను పెంచేందుకు ఏర్పాటు చేసిన స్వర్ణ పతకం నిధి కోసం పాలెం గ్రామానికి చెందిన రిటైర్డు ఎస్పీ నోముల మురళి తరఫున ఆయన సోదరుడు నోముల గోవిందరాజులు రూ.1.25 లక్షల విరాళాన్ని బుధవారం ప్రిన్సిపాల్ బెల్లి యాదయ్యకు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఉన్నారు.

నిత్యావసర వస్తువులు అందజేత



నిత్యావసర వస్తువులు అందజేస్తున్న సత్యసాయి సేవా సమితి సభ్యులు

చిట్యాల: మున్సిపాలిటీలోని తొమ్మిదో వార్డుకు చెందిన కునూరు పెద్ద నర్సింహ ప్రమాదవశాత్తు జారిపడడంతో కాలు విరిగింది. దీంతో అతడి కుటుంబానికి సత్యసాయి సేవా సమితి సభ్యులు నెల రోజులకు సరిపడా నిత్యావసర వస్తువులను బుధవారం అందజేశారు. కార్యక్రమంలో ఆ వార్డు మాజీ కౌన్సిలర్ బెల్లి సత్తయ్య, సత్యసాయి సేవా సమితి సభ్యులు మేడిశెట్టి ఝాన్సీ, నాగలక్ష్మి, చందా వెంకటేశ్వర్లు, చొల్లేటి శ్రీకాంత్‌చారి పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మించాలని వినతి

మునుగోడు: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని, అధికారులు చొరవ తీసుకొని ప్రతి పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని కోరుతూ డీవైఎఫ్ఐ నాయకులు బుధవారం తహసీల్దార్ నరేష్‌కు వినతి పత్రం అందజేశారు. అదేవిధంగా ప్రతి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసేందుకు ప్రత్యేక గదులు నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కట్ట లింగస్వామి, మండల అధ్యక్ష, కార్యదర్శులు బొడ్డుపల్లి నరేష్, యరసాని వంశీకృష్ణ, యాట శ్రీకాంత్, యాదయ్య, పవన్ తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రం పనులను త్వరగా పూర్తి చేయండి

మర్రిగూడ: మండల కేంద్రంలోని హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన భవిత కేంద్రం భవన నిర్మాణ పనులను వారంలో పూర్తి చేయాలని తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు అన్నారు. బుధవారం ఆయన భవిత కేంద్రం నిర్మాణ పనులను పరిశీలించారు. పెయింటింగ్ పూర్తి చేసి కేంద్రం గోడలపై చిత్రాలు గీయించాలని సూచించారు. ఆయన వెంట ఎంఈఓ బిట్టు శ్రీనివాస్, హెచ్‌ఎం కళా శ్రీనివాస్, ఆర్ఐ జహీరొద్దిన్, పందుల కృష్ణ, బిచ్యానాయక్, రామస్వామి తదితరులు ఉన్నారు.



తహసీల్దార్‌కు వివరాలు తెలియజేస్తున్న అధికారులు

పారిశుద్ధ్యం అస్తవ్యస్తం..

- వీధుల్లోనే పారుతున్న మురుగు
- దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు

శాలిగౌరారం: పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉండడంతో శాలిగౌరారం మండల కేంద్రంలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీధుల్లో మురుగు నిలిచి దుర్వాసన వస్తున్నా పట్టించుకునే వారే లేకపోవడంతో అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. శాలిగౌరారం గ్రామపంచాయతీ పరిధిలో మార్కెట్‌కాలనీ, బాలిశెట్టిగూడెం, పావురాలగూడెంలు ఆవాసా ప్రాంతాలుగా ఉన్నాయి. అందులో మార్కెట్‌కాలనీ పరిధిలో ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, పోలీస్‌స్టేషన్ ఉన్నాయి. ఆయా ప్రాంతాలతోపాటూ నకిరేకల్–గురుజాల, అంబేద్కర్ చౌరస్తా–భైరవునిబండ ప్రధాన రోడ్లవెంట, మార్కెట్ కాలనీలోని ప్రధాన వీధుల వెంట డ్రెయినేజీలు లేకపోవడంతో ఇళ్లలోని వ్యర్థపు మురుగునీరు వీధుల్లో ప్రవహిస్తోంది. దీంతో దుకాణాలకు వచ్చిపోయేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

డ్రెయినేజీల్లో అడ్డుకట్టలు

మార్కెట్‌కాలనీలోని రెండు వీధులు మినహా మిగిలిన వీధుల వెంట డ్రెయినేజీలు నిర్మించారు. కానీ అవి కూడా శిథిలావస్థకు చేరి ధ్వంసమయ్యాయి. దీనికితోడు ఇటీవల మార్కెట్‌కాలనీలోని వీధుల్లో సీసీరోడ్లు నిర్మించడంతో సైడ్ డ్రెయినేజీలు లోతుగా ఏర్పడి మట్టితో నిండిపోతున్నాయి. దీంతో మురుగునీరు నిలిచి తీవ్ర దుర్వాసన, దోమలు వ్యాప్తి చెంది ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. దీంతోపాటు డ్రెయినేజీల్లో ప్రతి ఇంటివద్ద సంబంధిత వ్యక్తులు మురుగు కాల్వలోకి ఎగువ నుంచి మురుగు నీరు రాకుండా అడ్డుకట్టలు వేస్తున్నారు. సంబంధిత అధికారులు డ్రెయినేజీల్లో పూడిక తీసి మురుగు సక్రమంగా కిందకు ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



శాలిగౌరారం మార్కెట్‌కాలనీలో మురుగుకాల్వకు అడ్డుగా వేసిన మట్టి కట్ట (ఫైల్)



మార్కెట్ కాలనీలో డ్రెయినేజీ లేక వీధిలో పారుతున్న మురుగు

దుర్వాసన వస్తోంది



“మార్కెట్‌కాలనీలోని డ్రెయినేజీల్లో మురుగు నీరు సాఫీగా ప్రవహించకుండా అడ్డుకట్టలు వేయడంతో మురుగు పేరుకుపోతోంది. దీంతో తీవ్ర దుర్వాసన వస్తోంది. దుర్వాసనకు ఇళ్లల్లో ఉండే పరిస్థితి లేదు. గ్రామపంచాయతీ దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. – జంపాల నరేశ్, మార్కెట్ కాలనీ, శాలిగౌరారం

డ్రెయినేజీలు లేవు



“మార్కెట్‌కాలనీలో ప్రధాన వీధుల వెంట డ్రెయినేజీలు లేవు. దీంతో ఇళ్లలోని వ్యర్థపు మురుగు నీటిని ప్రజలు రోడ్లపైకి వదలక తప్పడంలేదు. మా వీధి నిత్యం మురుగునీటితో నిండి ఉంటోంది. డ్రెయినేజీ నిర్మించాలని అధికారులు, ప్రజాప్రతినిధులను వేడుకుంటూనే ఉన్నా పట్టించుకోవడం లేదు.
– దునుక వెంకన్న, మార్కెట్‌కాలనీ, శాలిగౌరారం

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు పనిచేయాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సూచించారు. నకిరేకల్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం నకిరేకల్ మండలం నోముల గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థులు ఎవరైనా సరే విభేదాలు లేకుండా పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు పన్నాల రాఘవరెడ్డి, యాసా కరుణాకర్‌రెడ్డి, బాల నర్సయ్య, కుంచం సోమయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

మంత్రి పదవి కోసమే రాజగోపాల్‌రెడ్డి ఆరాటం



మున్సిపల్ అధికారులు కూల్చివేసిన భవనాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

- మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

చండూరు : మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి కోసమే ఆరాటం, యావ ఉందని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. చండూరులో మున్సిపల్ అధికారులు కూల్చిన మాజీ మున్సిపల్ కౌన్సిలర్, మాజీ ఎంపీపీ తోకల వెంకన్న భవనాన్ని బుధవారం కూసుకుంట్ల పరిశీలించి రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రాజగోపాల్‌రెడ్డి మతిస్థిమితం లేని మనిషని, మంత్రి పదవి ఇవ్వకుంటే రాజీనామా చేసే అవకాశం ఉందన్నారు. రాజకీయ కక్షతో కూల్చిన భవనానికి న్యాయస్థానం ద్వారా తిరిగి అనుమతి పొంది తోకల వెంకన్నకు న్యాయం చేస్తామని అన్నారు. ఎమ్మెల్యే స్థానికుడు కాదని అందుకే ఇక్కడి ప్రజలపై ప్రేమ లేదన్నారు. తన హయాంలో చండూరు మున్సిపాలిటీకి రూ.50 కోట్లు మంజూరు చేయించానని తెలిపారు. 90 ఫీట్ల వెడల్పుతో రోడ్డు పనులకు డీపీఆర్ సిద్ధం చేయించానని, చండూరు–మునుగోడు రోడ్డులో హైలెవల్ వంతెన మంజూరు చేయించానన్నారు. రాజగోపాల్ కొత్తగా నిధులు ఏమైనా తెచ్చారా అని ప్రశ్నించారు. తన రాజీనామాతో వెయ్యి కోట్ల నిధులు తెచ్చానని రాజగోపాల్‌రెడ్డి ప్రగల్భాలు పలుకుతున్నారని, ఆ జీవోలు చూపించగలడా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కర్నాటి వెంకటేశం, బీఆర్ఎస్ నాయకులు పెద్దిటి బుచ్చిరెడ్డి, మాజీ చైర్మన్ తోకల చంద్రకళ, మాజీ ఎంపీపీ తోకల వెంకన్న, బీఆర్ఎస్ మండల, పట్టణ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఇన్‌చార్జ్ మంత్రికి ఘన స్వాగతం



నల్లగొండలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి లక్ష్మణ్‌కుమార్‌తో మంత్రి కోమటిరెడ్డి, ఎమ్మెల్యేలు, నాయకులు

నార్కట్‌పల్లి: నల్లగొండకు వెళ్తున్న జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ మైనార్టీ దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని ఒక హోటల్ వద్ద నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆధ్వర్యంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, చెరువుగట్టు దేవస్థానం మాజీ డైరెక్టర్ గడ్డం పశుపతి, వడ్డె భూపాల్‌రెడ్డి, బండ సాగర్‌రెడ్డి, దూదిమెట్ల సత్తయ్య, సట్టు సత్తయ్య, జెర్రిపోతుల భరత్, నేతగాని కృష్ణ, వరాల రమేష్, భద్రాచలం, యాదయ్య పాల్గొన్నారు.

చిట్యాల: నల్లగొండలో జరిగే జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశానికి వెళ్తున్న జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు చిట్యాలలో బుధవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి పోకల దేవదాసు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జడల చినమల్లయ్య, మాజీ ఎంపీటీసీ ఎద్దులపురి కృష్ణ, దేశపాక రాజేష్, మోహన్, అశోక్ పాల్గొన్నారు.

నకిరేకల్ : నల్లగొండ పట్టణానికి బుధవారం వచ్చిన జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం స్వాగతం పలికి సత్కరించారు. ఆయన వెంట పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ఉన్నారు. అదేవిధంగా జిల్లా ఇన్‌చార్జ్ మంత్రికి నల్లగొండ పట్టణంలో జిల్లాలోని ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు స్వాగతం పలికారు.

బావిలో పడిన ఆవును రక్షించిన పోలీసులు

నల్లగొండ: పట్టణంలోని బొట్టుగూడలో గల పాత బావిలో బుధవారం ఒక ఆవు పడిపోయింది. సమాచారం తెలుసుకున్న వన్‌టౌన్ పోలీసులు బుధవారం ఎస్‌ఎఫ్‌ఓ సత్యనారాయణరెడ్డితో కలిసి రిస్క్యూ టీమ్ సాయంతో ఆవును బయటకు తీసి సురక్షిత ప్రదేశానికి తరలించారు.

ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతి

మర్రిగూడ: మండలంలోని దామెరభీమనపల్లి గ్రామానికి సమయానికి అనుగుణంగా ఆర్టీసీ బస్సులు నడపాలని కోరుతూ గ్రామానికి చెందిన జిల్లా కిశోర్ బుధవారం నల్లగొండ ఆర్టీసీ డిపో మేనేజర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దామెరభీమనపల్లి గ్రామానికి సమయానికి అనుగుణంగా బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

నూతన కమిటీ నియామకం

నల్లగొండ: తెలంగాణ ఆల్ మైనార్టీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడిగా అష్రఫ్ అహ్మద్, ప్రధాన కార్యదర్శిగా మహమ్మద్ అహ్మద్‌లను నియమిస్తూ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ ఫరూక్ హుస్సేన్, డాక్టర్ సయ్యద్ అబ్దుల్ వహిషా ఖాద్రీ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అసోసియేట్ అధ్యక్షులుగా మహమ్మద్ బుర్హానుద్దీన్, సయ్యద్ శాకీర్, ఉపాధ్యక్షులుగా మొహమ్మద్ ఫజల్ అహ్మద్, ముహమ్మద్ తౌసీఫ్ అహ్మద్, కోశాధికారిగా సయ్యద్ రఫీ, అదనపు ప్రధాన కార్యదర్శిగా ముహమ్మద్ సైపుద్దిన్, జాయింట్ సెక్రటరీగా ఎండీ అబ్దుల్ షహబాజ్, ఆర్గనైజేషన్ కార్యదర్శిగా కేఎం సుసురత్ వలీ, కార్యవర్గ సభ్యులుగా షేక్ మొహమ్మద్ రఫీ, వహీదు రహమాన్, సలహాదారులుగా ఎంఏ వసీం కరీంలను నియమించారు. నియామక ఉత్తర్వులు మూడు సంవత్సరాలు అమలులో ఉంటాయని అసోసియేషన్ నాయకులు తెలిపారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి



నల్లగొండ టౌన్ : నోటీసు ఇస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్: ఈ నెల 9న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె, గ్రామీణ బంద్‌లో కార్మికులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి నాగయ్య, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం నల్లగొండ పట్టణంలోని దొడ్డి కొమరయ్య భవన్‌లో జరిగిన ప్రజాసంఘాల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వి.వెంకటేశ్వర్లు, ప్రజాసంఘాల నాయకులు నారి ఐలయ్య, పాలడుగు నాగార్జున, ప్రభావతి, కందాల ప్రమీల, శ్రీశైలం, గంజి మురళీధర్, అవిశెట్టి శంకరయ్య, ఎండీ.సలీం, సత్తయ్య, శ్రీనివాస్, పరశురాములు, మహేష్, పోలబోయిన వరలక్ష్మి, కొండ అనురాధ, వెంకన్న, శంకర్, నరేష్‌లు పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత

ఈ నెల 9న నిర్వహించనున్న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొననున్నట్లు నల్లగొండ పట్టణంలో ఎలక్ట్రిసిటీ స్టోర్ ఏడీకి స్టోర్ హమాలీలు సీఐటీయూ నాయకులతో కలిసి బుధవారం సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దండంపల్లి సత్తయ్య, పట్టణ కన్వీనర్ అవుట రవీందర్, కత్తుల యాదయ్య, యాదగిరిరెడ్డి, శంకర్, కృష్ణయ్య, నర్సింహ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసు

చిట్యాల: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 9వ తేదీన నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్ కోరారు. చిట్యాలలో బుధవారం మున్సిపల్ కమిషనర్ దండు శ్రీనుకు మున్సిపల్ కార్మికులు సమ్మె నోటీసు అందజేసే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఏనుగు వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రుద్రవరం నర్సింహ, నాయకులు జడల నర్సింహ, జిట్ట నరేష్, బాకి అండాలు, పులిగిల్ల పద్మ, జ్యోతి, శోభ, లింగస్వామి పాల్గొన్నారు.

లేబర్ కోడ్స్ వెంటనే రద్దు చేయాలి

మునుగోడు: కార్మికుల హక్కులను కాలరాసే లేబర్ కోడ్‌లను వెంటనే రద్దుచేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మునుగోడులో జరిగిన గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 9న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీఐటీయూ మండల కన్వీనర్ వరికుప్పల ముత్యాలు, నాయకులు ఎర్రగోని లింగయ్య, అరుణ, రాజు, అండాలు, పెద్దమ్మ, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యత ఇవ్వాలి



మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు వినతి పత్రం అందజేస్తున్న క్రిస్టియన్ సంఘాల నాయకులు

రామగిరి(నల్లగొండ): నామినేటెడ్ పోస్టుల్లో క్రిస్టియన్లకు ప్రాధాన్యత కల్పించాలని కోరుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లా క్రిస్టియన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రేఖల భద్రాద్రి బుధవారం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భద్రాద్రి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండి అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీని గెలిపించడంలో క్రియాశీలక పాత్ర పోషించామన్నారు. గత ప్రభుత్వం క్రిస్టియన్లకు ఎమ్మెల్సీతోపాటు నామినేటెడ్ పోస్టులు ఇచ్చిందని తెలిపారు. క్రిస్టియన్లకు రెండు కార్పొరేషన్ పదవులు ఇవ్వాలని కోరారు. అదేవిధంగా జిల్లాలోని క్రైస్తవులకు సమాధులు, చర్చీల నిర్మాణానికి తగిన స్థలం కేటాయించాలని మంత్రులకు విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో టీఎస్ క్రిస్టోఫర్, జయప్రకాష్, కట్ట మోజెష్, బిషప్ సమర్పణ కుమార్, ఇసాక్, ఆశయ్య, ప్రవీణ్, నతనియన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలని వినతి

నల్లగొండ టౌన్: జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు కేవీపీఎస్ ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు. బెస్ట్ అవైలబుల్ స్కీంకు నిధులు విడుదల చేయని కారణంగా ప్రైవేటు పాఠశాలల్లో బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కింద విద్యార్థులను చేర్చుకోవడం లేదని తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను, ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున, రెమిడాల పరశురాములు, గాదె నరసింహ, వంటిపాక కృష్ణ, గొల్లు రవీందర్ ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని మంత్రి కోమటిరెడ్డికి మెప్మా ఉద్యోగుల వినతి

నల్లగొండ: మెప్మా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం నల్లగొండలో రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి మెప్మా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బక్కయ్య వినతి పత్రం అందజేశారు. మెప్మా ఉద్యోగులకు పేస్కేలు ప్రకారం వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని మంత్రికి విన్నవించారు. జిల్లాలో 16 మంది మెప్మా ఉద్యోగులకు గాను 13 మందికి మాత్రమే పేస్కేలు వర్తింపజేశారని, మిగతా ముగ్గురికి కూడా పేస్కేల్ వర్తింపజేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎస్.సరిత, సీహెచ్. పద్మ, జ్యోత్స్న ఉన్నారు.

ప్రధాని మోదీకి గుణపాఠం తప్పదు

మునుగోడు: దేశ భవిష్యత్‌ను అమెరికా అధ్యక్షుడి చేతిలో పెట్టిన ప్రధాని మోదీకి రానున్న రోజుల్లో తగిన గుణపాఠం తప్పదని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరిపారి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని అమెరికన్ రాయబార కార్యాలయ ముట్టడి కార్యక్రమం చేపట్టగా పోలీసులు వారిని అరెస్ట్‌చేసి మునుగోడు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం తిరిపారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కేవలం వ్యాపార దృష్టితోనే ఇరు దేశాలతో స్నేహం కొనసాగిస్తున్నాడని, దానిని మోదీ గమనించి అమెరికాతో సంబంధాలను తెగతెంపులు చేసుకోవాలని డిమాండ్ చేశారు. అరెస్టయిన వారిలో ఏఐవైఎఫ్ మండల అధ్యక్షుడు బండారి శంకర్, గోసుకొండ మల్లేష్, కట్కూరి లింగస్వామి, కట్ట దశరథ, గోపగోని ఉదయ్, అందుగుల నరేష్ తదితరులు పాల్గొన్నారు.



మునుగోడు : పోలీస్‌స్టేషన్ ఎదుట నినాదాలు చేస్తున్న నాయకులు

మర్రిగూడ : భారతీయ పౌరులపై అమెరికా చర్యలను నిరసిస్తూ హైదరాబాద్‌లోని అమెరికా రాయబార కార్యాలయ ముట్టడికి వెళ్తున్న ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బూడిద సురేష్‌ను పోలీసులు బుధవారం ముందస్తుగా అరెస్ట్ చేసి మర్రిగూడ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బూడిద సురేష్ మాట్లాడుతూ దేశ ప్రయోజనాలను, ప్రతిష్ఠను అమెరికాకు తాకట్టు పెడుతున్న కేంద్ర ప్రభుత్వంపై ఉద్యమించాలన్నారు.

ప్రణయ్ ఆపరేషన్‌కు ఎన్‌ఆర్ఐ భరోసా


సాక్షి ఎఫెక్ట్..

మర్రిగూడ : మండలంలోని శివన్నగూడ గ్రామానికి చెందిన పదకొండు సంవత్సరాల బాలుడు బల్లెం ప్రణయ్ ఏడాది నుంచి తలసేమియా వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. ప్రణయ్ దీనగాథపై గత నెల 4న సాక్షి దినపత్రికలో ‘దాతలు సహాయం చేయరూ..’అనే కథనం ప్రచురితమైంది. మరుసటి రోజే గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త నీలకంఠ రామస్వామి ఆలయ కమిటీ చైర్మన్ రాపోలు యాదగిరి స్పందించి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.లక్ష ఆర్థిక సహాయం అందజేశారు. సాక్షి దినపత్రికలో కథనాన్ని చూసిన ఆరోగ్యశ్రీ జిల్లా యంత్రాంగం.. ఈ విషయాన్ని ఆరోగ్యశ్రీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గిరి యాదయ్యకు తెలియజేశారు. గిరి యాదయ్య ఇందుర్తి గ్రామానికి చెందిన ఎన్‌ఆర్ఐ కుంభం శ్రీనివాస్‌రెడ్డికి విషయం వివరించగా.. ఆపరేషన్‌కు అయ్యే రూ.5 లక్షలకుపైగా ఖర్చులు తానే భరిస్తానని భరోసా కల్పించారు. దీంతో బుధవారం హైదరాబాద్‌లో గిరి యాదయ్య ఆధ్వర్యంలో శ్రీనివాస్‌రెడ్డిని ప్రణయ్ తల్లిదండ్రులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆపరేషన్‌కు కొంత సమయం ఉన్నందున ప్రస్తుతం అందుతున్న వైద్య ఖర్చులు కూడా శ్రీనివాస్‌రెడ్డి భరిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



ఎన్‌ఆర్ఐ కుంభం శ్రీనివాస్‌రెడ్డితో ప్రణయ్ తల్లిదండ్రులు

రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కేతేపల్లి: గ్రామీణ రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని కోరుతూ బీజేపీ నాయకులు బుధవారం కేతేపల్లి ఎంపీడీఓ బి.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుల పిట్ట వెంకట్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రోడ్లకు ఏళ్ల తరబడి మరమ్మతులు చేయకపోవడంతో గుంతలమయంగా మారి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గడ్డం వేణుగోపాల్‌రెడ్డి, ఎ.అనిత, కూరెల్లి విజయలక్ష్మి, పద్మ, సమ్మెట విజయలక్ష్మి, నూకల సంధ్య, సొదయ్య, పోకల రమేష్, లింగాల లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని నిరసన

నకిరేకల్ : ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని కోరుతూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో బుధవారం నకిరేకల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను బంద్ చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా నాయకుడు అంబటి చిరంజీవి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న రూ.7200 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు అంబటి నరసయ్య, మహేష్, గణేశ్, స్వామి, రాములు, చెరుకు సైదులు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న నాయకులు

మలుపులు.. ప్రమాదాలకు పిలుపులు





చిట్యాల నుంచి వనిపాకలకు వెళ్లే దారిలోని ప్రమాదకరంగా ఉన్న మూలమలుపులు

చిట్యాల : మండలం కేంద్రం నుంచి వనిపాకల గ్రామానికి సుమారుగా మూడున్నర కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఈ రోడ్డు అనేక మూలమలుపులతో నిర్మించారు. ఈ మూడున్నర కిలోమీటర్లలో పదికి పైగా ప్రమాదకర మూలమలుపులు ఉన్నాయి. దీంతో ఎదురుగా వచ్చే వాహనం కనిపించక వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. అంతేకాకుండా ఈ గ్రామ శివారులో మూలమలుపు వద్ద ధర్మారెడ్డి పల్లి కాల్వపై నిర్మించిన కల్వర్టు ఇరుకుగా ఉంది. దీంతో ఎందరో వాహనదారులు అదుపుతప్పి తమ వాహనాలతో పాటు కల్వర్టులో పడి గాయాలపాలయ్యారు. అధికారులు స్పందించి ప్రమాదకర మూలమలుపులను సరిచేసి, సూచికబోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.